: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 5 | 08-11-2021 | పుటలు : 4


# నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తాం

■ రాష్ట్ర విద్యాశాఖామంత్రి డా.ఆదిమూలపు సురేష్ ■ ఇంజనీరింగ్ వర్క్ షాప్స్ భవనాన్ని ప్రారంభించిన మంత్రులు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

**06.11.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తామని, వచ్చే బడ్జెట్ లో విశ్వవిద్యాలయానికి సంబంధించిన పూర్తి నిధులను విడుదల చేసేందుకు ప్రయత్నిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి డా.ఆదిమూలపు సురేష్ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రాంగణంలోని నూతనంగా నిర్మించిన ఇంజనీరింగ్ వర్క్ షాప్స్ భవన ప్రారంభోత్సవం శనివారం వైభవంగా జరిగింది. సుమారు రూ.6 కోట్లతో యూనివర్సిటీ నిధులతో జీ+2 పద్దతిలో నిర్మించిన ఇంజనీరింగ్ వర్క్ షాప్ భవనాన్ని, వసతులను ఏర్పాటు చేసారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర విద్యాశాఖామంత్రి ఆదిమూలపు సురేష్, ఎం.పి మార్గాని భరత్ రామ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, సబ్ కలెక్టర్ ఇలాకియా ఐఏఎస్, వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు వర్క్ షాప్స్ గదులను,ప్రయోగశాలలను, తరగతి గదులను ప్రారంభించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఇంజనీరింగ్ ఎగ్జిబిషన్ ప్రాజెక్టులను అతిథులు సందర్శించారు. అనంతరం యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన సమావేశానికి అతిథులు హాజరై విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉన్నత విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చే విధంగా అడుగులు వేస్తున్నాం. రాష్ట్రంలో రెండున్నర సంవత్సరాల కాలంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి తీసుకున్న విప్లవాత్మక మార్పులు ముఖ్యంగా ఉన్నత విద్యకు సంబంధించి రాష్ట్రంలోని 14 విశ్వవిద్యాలయాలతో పాటు ఇతర విద్యాలయాలను జాతీయ స్థాయిలో ఉన్నత ప్రమాణాలతో ఎన్.ఆర్.ఎఫ్.ఐ. ర్యాంకింగ్ లో కనీసం ఐదు,ఆరు యూనివర్సిటీలు ఉండేలా అభివృద్ధి చేస్తామన్నారు. నూతన జాతీయ విద్యావిధానంలో ఛాయిస్ బేసిడ్ క్రెడిట్ సిస్టమ్, ఎకడమిక్ క్రెడిట్ బ్యాంకింగ్ క్రెడిట్ సిస్టమ్, కామన్ సిలబస్, ఇన్టెన్షిప్ లు వంటి విధానాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 410 అనుబంధ కళాశాలలతో అతిపెద్ద విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెందుతుంది. నన్నయ యూనివర్సిటీ పెండింగ్ వర్క్స్ పూర్తి చేయడానికి ఉన్న క్యాప్టల్ గ్రాంట్ త్వరలో విడుదల చేయడానికి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తాం.రాష్ట్రంలోని వీసీ లు అందరితో సి.ఎం. జగన్మోహనరెడ్డి


ప్రాజెక్టులను సందర్శించిన మంత్రి, నాయకులు


ఇంజనీరింగ్ వర్క్ షాప్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మూడు సంవత్సరాల పదవీ కాలం ముగిసేసరికి విశ్వవిద్యాలయాలను విద్య, పరిశోధన,మౌలిక సదుపాయాల కల్పన, విద్యార్థుల ప్రగతి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి అభివృద్ధి ఏ విధంగా సాధించాలనే అంశాలను దిశా నిర్దేశం చేసారు. ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయానికి రావడం చాలా సంతోషంగా ఉంది. ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రోజెక్టులు ఉత్తమ పేటెంట్ పొందడానికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయి. కోవిడ్ సమయంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వందకు పైగా వెబినార్లు నిర్వహించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ ప్రతిపాదనలో ఉండడం అభినందనీయమన్నారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావును, విద్యార్థుల వినూత్న విజ్ఞాన విధానాలను మంత్రి అభినందించారు. ఎం.పీ. మార్గాని భరత్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ క్రీడాభివృద్ధికి నిధులను తీసుకొని వచ్చామని,భవిష్యత్తులో విశ్వవిద్యాలయాభివృద్ధికి మరింత కృషి చేస్తామని అన్నారు. ఒలింపిక్స్ స్థాయిలో పోటీపడే విధంగా క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ దివంగతనేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఉన్నత విద్యాభివృద్ధికి తీసుకున్న చర్యలలో భాగంగా నన్నయ విశ్వవిద్యాలయం ఏర్పడిందని దీనిని మరింత అభివృద్ధిచేసే బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందన్నారు. భవన నిర్మాణాల నిమిత్తం పెండింగ్ లో ఉన్న నిధుల్ని సత్వరమే మంజూరు చేయాలని మంత్రిని కోరారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఎంపీ మార్గాని భరత్ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాలు చేస్తున్న కృషిని అభినందించారు. విశ్వవిద్యాలయానికి రావలసిన పెండింగ్ నిధులను తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రయత్నిస్తున్నారని, భవిష్యత్తులో విశ్వవిద్యాలయానికి నిధులు వస్తాయని కృతజ్ఞతలు తెలియజేశారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా విద్యార్థులను చైతన్యపరచటంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ అధ్యాపక బృందం విరివిగా ఉపయోగించుకున్నట్టు రికార్డు స్థాయిలో 100 కు పైగా వెబినార్లు నిర్వహించిన విషయాన్ని వివరించారు. తాను బాధ్యతలు స్వీకరించిన తరువాత ఐ.ఎస్.ఓ., ఎ.ఐ.సి.టి.ఇ. గుర్తింపు ను సాధించామని నాక్ గుర్తింపు లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు. అనంతరం యూనివర్సిటీ తరుపున అతిథులను శాలువాతో సన్మానించి జ్ఞాపికలను అందించి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, జెడ్.పి.టి.సి. సభ్యులు వాసంశెట్టి పెదవెంకన్న, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఈసీ మెంబర్లు ఆచార్య కె.శ్రీరమేష్, డా.బి.జగన్మోహనరెడ్డి, ఆచార్య జె.సునీత, ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, యూనివర్సిటీ ఇంజనీర్ డా.కె.నూకరత్నం, ఆదిత్య శేషారెడ్డి, అనుబంధ కళాశాలల ప్రతినిధులు, అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంపాదకీయం



# భావి భారత నిర్ణేతలు

పిల్లలతో మాట్లాడటం ఒక కళ. ఒక శాస్త్రం. మనం మాట్లాడే ప్రతి సందర్భం వారికి ఒక జీవన సత్యాన్ని ఆవిష్కరించి చూపాలి. పిల్లలతోనే కాదు, మనం ఇతరులతో మాట్లాడేటప్పుడు కూడా పిల్లలు మనని, ఇతరులను వింటూ ఉంటారు. అర్థం చేసుకుంటారు. మనల్ని అనుకరిస్తారు కూడా.

గతం పునాది మీదే వర్తమానం, భవిష్యత్తులు నిర్మితమవుతాయి. గతతరం సంస్కారంపైనే నేటితరం తన భవిష్యత్తును నిర్మించుకుంటుంది. గతమంతా శుచిగా, శుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంటే వర్తమానం, భవిష్యత్తులు కూడా అలాగే ఉంటాయి. ఏది మనం విత్తుతామో అదే మొలుస్తుందనేది ప్రకృతి సూత్రం అయితే ప్రకృతి నుండి పుట్టిన మనిషికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.

ఒక వ్యక్తి ప్రవర్తన, కుటుంబం నడవడిక, సమాజం ఇవన్నీ మాలిన్యంలేని బాల్యం పైన ప్రగాఢమైన ముద్రలను వేస్తాయి. బాల్యంలోని అనుభవాలు స్మృతులే ఆ వ్యక్తి జీవితాన్ని నిర్దేశించే శక్తులుగా మారతాయి. వాళ్ళ చుట్టూ అమానుషత్వ వాతావరణాన్ని సృష్టించి వాళ్లు మానసిక రోగులు కాకూడదని ఆశిస్తారు పెద్దలు. ఉగ్గుపాలతోనే మనిషిని మనిషి తాకరాదని వైషమ్యాన్ని నూరిపోస్తూ వాళ్ళ నుండి మానవత్వాన్ని ఆశిస్తారు. కులమని,మతమని తన పర భేదం పాటిస్తూ వాళ్లను మదర్ తెరిసా, మహాత్మా గాంధీ, వివేకానంద, అబ్రహం లింకన్, అంబేద్కర్ లాంటి వారుగా ఎదగాలని కోరుకుంటారు. అధికారాన్ని కాపాడుకోవడం కోసం ఎన్ని విధాలైన అక్రమ మార్గాలు తొక్కుతూ తమ పిల్లలు మాత్రం సక్రమ మార్గంలో పయనించాలని కోరుకుంటూ ఉంటారు.

వర్తమానానికి, భవిష్యత్తుకు బీజాలు బాల్యంలోనే పడతాయి. బాల్యం భవిష్యత్తు సౌధానికి పునాది. శారీరక మానసిక శక్తులకు వ్యక్తుల ప్రవర్తనలకు మూలం బాల్యంలోనే ఉంటుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. తమ పిల్లల్ని తమ వారసులుగా తమ కలల్ని తమ కోరికల్ని సాకారం చేసే సాధనాలుగానే తల్లిదండ్రులు భావించటం విచారకరం. తల్లిదండ్రులు తమ పిల్లల్ని అమితంగా ప్రేమిస్తారు. కానీ గౌరవించడం లేదు. వాళ్లకు హక్కులుంటాయని గుర్తించడం లేదు. ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల ఉల్లంఘనకు గురవుతున్న వారిలో పిల్లలే ప్రథమస్థానంలో ఉన్నారు. సాంఘిక, ఆర్థిక,రాజకీయ అణచివేతకు దోపిడీలకు యుద్ధ వినాశనాలకు మొదటిగా బలవుతున్నది పిల్లలే. ఈనాటికీ అధికశాతం పిల్లలు బాల కార్మికులు, బాల నేరస్థులుగా, నిరక్షరాస్యులుగా ఇంకా అనేక రకాలుగా వారు సమాజంలో మనకు కనిపిస్తారు. పేదరికం,అవిద్య, అనారోగ్యం, వ్యాపార నాగరకత, ఉగ్రవాదం, యుద్ధాలు లక్షలాది మంది పిల్లల బాల్యాన్ని చిదిపేస్తున్నాయి.

రేపటి పౌరుల్ని, భావిభారత నిర్ణేతల్ని వర్తమానంలోంచి సక్రమంగా తీర్చిదిద్దుకోవడానికి జరిగే కృషిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కీలకమైన పాత్రను పోషించాల్సిన అవసరం ఎంతో ఉంది. చాచా నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవం సందర్భంగా అటువంటి ఆలోచనల దిశగా మనం పయనిద్దాం!!

# అవినీతిరహిత సమాజాన్ని నిర్మిద్దాం




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వీసీ

**05.11.21 (మీడియాసెల్)** విలువలు, నీతి, నిజాయితీలతో నేటితరం యువత దేశాభివృద్ధికై కృషి చేయాలని అవినీతి రహిత సమాజాన్ని నిర్మించే సామర్థ్యం యువతకు మాత్రమే ఉందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్శిటీ సహకారంతో ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ లిమిటెడ్ విజిలెన్స్ అవేర్నెస్ వీక్ నిర్వహించింది. "స్వతంత్ర భారతదేశం ఏ75: సమగ్రతతో స్వయం రిలయన్స్" అనే థీమ్ తో విజిలెన్స్ ప్రాముఖ్యంపై అవగాహన కల్పిస్తుంది. యూనివర్సిటీ లాంగ్వేజ్ ల్యాబ్ లో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాన్ని వీసీ జగన్నాథరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సమాజంలో అవినీతి భాగస్వామ్యమై పోయిందని దానిని రూపుమాపే శక్తిసామర్థ్యాలు యువతరంలో మాత్రమే ఉన్నాయని అన్నారు. అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం యువత పాటుపడాలన్నారు. యువత మేధస్సును, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ అవినీతికి అడ్డుకట్ట వేయాలన్నారు. వినూత్న విధానాలతో అవినీతి రహిత సమాజాన్ని ఏ విధంగా రూపొందించవచ్చునో వివరించారు. అన్ని రంగాల్లోని, అన్ని శాఖల్లోని పారదర్శక పాలన అందాలని తెలియజేసారు. ఇటువంటి విజిలెన్స్ వీక్ లలో పాల్గొనడం ద్వారా సమాజ పరిస్థితులపై అవగాహన ఏర్పడుతుందన్నారు. తరువాత విజిలెన్స్ అవేర్నెస్ పై క్యాంపస్ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు మరియు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేసారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర సమన్వయకర్త డా. ఎన్ ఉదయ్ భాస్కర్, ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ లిమిటెడ్ రాజమండ్రి డివిజన్ అసిస్టెంట్ మేనేజర్ ఎం.ఎన్. పృద్వీరాజ్, అధ్యాపకులు బి.బి.అహ్మద్ అలీ పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యను అందించాలి




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**01.11.21 (మీడియాసెల్)** సమాజానికి గురువులను అందించే గొప్ప బాధ్యత విద్యాకళాశాలలపై ఉందని, ఉభయగోదావరి జిల్లాల్లోని అన్ని విద్యాకళాశాలలు నాణ్యమైన విద్యను అందించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో సోమవారం కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ కళాశాలలతో సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో విద్యాకళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సమాజంలో అత్యంత గౌరవ ప్రదమైన వృత్తి ఉపాధ్యాయవృత్తి అని, అటువంటి ఉపాధ్యాయులను సమాజానికి అందించే గొప్ప బాధ్యత విద్యాకళాశాలలపై ఉందని అన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని ఎందరో ప్రముఖులు ఉన్నత లక్ష్యాలతో విద్యాకళాశాలలను స్థాపించారని వాటి ఔన్నత్యాలను మరింత పెంచే విధంగా ఎడ్యుకేషన్ కళాశాలలను నడపాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఉన్నతవిద్యలో నాణ్యతపై ప్రత్యేక దృష్టిని సారించారని, ప్రతీ కళాశాలలో నాణ్యమైన విద్య అందరికి అందుబాటులో ఉండాలన్నారు. నైపుణ్యాలను అభివృద్ధి పరచి విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. అన్ని విద్యాకళాశాలల్లోని పూర్తి స్థాయిలో తరగతులు జరగాలని, విద్యార్థులచే సమర్థవంతంగా రికార్డులను వ్రాయించాలని నిబంధనలను పాటిస్తూ పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. కొన్ని ఎడ్యుకేషన్ కళాశాలలపై ఫిర్యాదులు వస్తున్నాయని వాటిని సరిచేసుకొని విలువలతో కూడిన విద్యను అందించాలని హెచ్చరించారు. నాణ్యమైన విద్యను అందిచడమే లక్ష్యంగా విద్యాకళాశాలలు పని చేయాలని వీసీ సూచించారు. సీడీసీ డీన్ డా.ఎం.కమలకుమారి మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల్లోని మొత్తం 64 ఎడ్యుకేషన్ కళాశాలలు ఉన్నాయని అన్నారు. ఆయా విద్యాకళాశాలల వివరాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలియజేసారు. అనంతరం సీడీసీ, అనుబంధ విద్యాకళాశాలల అసోసియేషన్స్ ఆధ్వర్యంలో వీసీని సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ డా.ఎం.కమలకుమారి, అసోసియేట్ డీన్ డా.పి.వెంకటేశ్వరరావు, ఫ్యాకల్టీ అసోసియేట్ డా.పి.రాజశేఖర్, డా.వై.సుష్మప్రియ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా వాణి

# కందుకూరి రాజ్యలక్ష్మి

## ( నవంబర్ 5 జయంతి)



ప్రముఖ సంఘసంస్కర్త,యుగపురుషుడు, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం గారి భార్య రాజ్యలక్ష్మి. ఈమెకూడా గొప్ప సంఘసంస్కర్త. భర్త అడుగుజాడలలో పయనిస్తూ తన దృష్టి మొత్తం సమాజసేవమీద పెట్టి చివరివరకు భర్తనే అనుసరించింది.

కందుకూరి రాజ్యలక్ష్మి గోదావరి తీరంలోని ఒక సంప్రదాయ కుటుంబంలో పుట్టింది. చిన్నతనంలోనే తల్లిని కోల్పోవటంతో మేనమామ ఇంటిలో పెరుగింది. ఆడవాళ్ళు బయటకు రాని ఆ రోజుల్లోనే బడికి వెళ్ళి విద్య నేర్చుకుంది. ఈమెకు 1860 సంత్సరంలో 9 ఏళ్ల వయసులో 13 సంవత్సరాల వీరేశలింగం గారితో వివాహం అయింది.

రాజమహేంద్రనగరంలో 1881 డిసెంబర్ లో ఈ దంపతులు ఒక వితంతువుకి వివాహం జరిపిస్తారు. రాజమహేంద్రనగరమంతా ఈ వివాహాన్ని వ్యతిరేకిస్తుంది. కానీ కందుకూరి రాజ్యలక్ష్మి ఒక్కతే తన భర్తకు బాసటగా నిలుస్తుంది.గోదావరి నదికి వెళ్లి ఒక్కామే బిందెలతో నీళ్లు మోసి వంటలు చేసింది.భర్తవెంట నిలచి వితంతు వివాహంలో అక్షింతలు వేసిన ముత్తయిదువుగా చరిత్రలో నిలచిపోయింది.

తరువాత తన ఇంటిని విద్యాలయంగా మార్చింది.వితంతు శరణాలయానికి సహకరించింది. మహిళలకు మధ్యాహ్నం పాఠాలు చెప్పేది. వంచించబడిన యువతులకు తన ఇంటిలో ఆశ్రయం ఇచ్చింది. అనాథ పిల్లల ఆశ్రయంగా తన ఇంటిని తీర్చిదిద్దింది. రోడ్డుమీద అనారోగ్యంతో పడిపోయిన వ్యక్తిని ఆదరించి తన ఇంటికి తీసుకువచ్చి వైద్యసేవలు ఏర్పాటు చేసింది. తాను విగ్రహారాధనను వదలి స్త్రీలకొరకు ప్రార్థనా మందిరాలను ఏర్పాటు చేసింది.

సంఘ సంస్కరణలో,మహిళల కోసం నిర్వహించిన పత్రికల విషయంలో,రచనల విషయంలో భర్తకు పూర్తి సహకారాల్ని అందించింది.

ఆమె పేరుమీద శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలు రాజమహేంద్రవరంలో నడుస్తూ ఎంతోమందికి విద్యా దానం చేస్తున్నాయి.

శక్తివంతమైన మహిళగా సంఘ సంస్కరణ లో తమదైన పాత్రను పోషించి భర్త కందుకూరి వీరేశలింగం గారికి సహకారాన్ని అందించి సమాజ చైతన్యానికి పాటుపడిన ఆమెకి ఘన నివాళిని అర్పిస్తూ నన్నయవాణి అక్షర నీరాజనాలు సమర్పిస్తోంది.



పవిత్రతకు మరోపేరు ప్రాతఃస్నానం!
భవబంధము తొలగజేయు సంధ్యాదీపం!!


హరిహరులకు ప్రియమైన
అద్వైతం!...కార్తీక మాసం!!

చిత్రం:
'హంపి'
రాజమహేంద్రవరం.

# భారత దర్శనం

## పుస్తకం

మన మొదటి ప్రధానమంత్రి, గొప్ప ప్రజాస్వామ్యవాది అయిన నెహ్రూ ఆంగ్లంలో అనేక గ్రంథాలను రచించారు. తను రాసిన 'స్వీయచరిత్ర' కు కొనసాగింపుగా మరో రచనను చేశారు. తనకు మహా ప్రీతిపాత్రమైన, తను ప్రగాఢంగా ప్రేమించే భారత మాతను గురించి రాస్తే బాగుంటుందని "ది డిస్కవరీ అఫ్ ఇండియా" గ్రంథ రచనకు పూనుకుని పూర్తిచేశారు. ఈ గ్రంథ రచనలో అబుల్ కలాం ఆజాద్, గోవింద వల్లభ్ పంత్ వంటి స్వాతంత్ర్య సమరయోధులు తమ సహాయాన్ని అందించారు. ఈ పుస్తకం తెలుగులో 'భారత దర్శనం ' అన్న పేరుతో వెలువడింది. మనిషి, మానవ స్వభావం కొన్నిసార్లు చాలా చిత్రంగా అనిపిస్తుంది, ఎందుకంటే మనం చాలా జీవులతో అలాగే వస్తువులతో పుస్తకాలతో స్నేహం చేస్తుంటాము. కొన్ని పుస్తకాలు మనకు చిరకాల మిత్రునిలా వెన్నంటే ఉంటాయి, ఒక పుస్తకం చదివితే అందులో రచయిత యొక్క మనస్సు, ఆలోచనలు, ప్రశ్నలు ఏకపాత్రాభినయం చేస్తుంటాయి. కానీ కొన్ని అరుదైన పుస్తకాలు మాత్రం మీతో సంభాషిస్తాయి, మీపై ప్రశ్నలను సందిస్తాయి. అలాగే మీ దృక్పథాన్ని మారుస్తాయి "డిస్కవరీ ఆఫ్ ఇండియా" కూడా అటువంటి పుస్తకమే. ఇది జైలు గదిలో రాసిన పుస్తకం,





సమస్యాత్మకమైనప్పటికీ స్థిరమైన మనస్సు ద్వారా అతని గతాన్ని ఆవిష్కరించింది. ఇందులో నెహ్రూ మన దేశం యొక్క గతాన్ని, మూలాల గురించి చర్చించారు. అలాగే మన సంస్కృతి, సాహిత్యం, సైన్స్, మరియు తత్వశాస్త్రం పరిశీలించి భారతదేశాన్ని ఒక దేశం, ఒకే ప్రజలుగా అభివర్ణించారు.

ఈ పుస్తకాన్ని భారతదేశ చారిత్రక కథనాలలో ఒకటిగా వర్గీకరించడం అసంపూర్ణమైన అంచనా. నెహ్రూ ఈ పుస్తకంలోని అనేక ఇతివృత్తాలతో సతమతపడుతూ - గతాన్ని వర్తమానంతో అనుసంధానించే మరియు భవిష్యత్తు పథాలను సూచించే కీలకమైన పరిస్థితులను, ఒక వ్యక్తి యొక్క స్వీయ భావన మరియు అతను నివసించే నాగరిక విలువలు మరియు మానవత్వం యొక్క పెద్ద ప్రయాణం. ఈ ఇతివృత్తాలు ఒకదానికొకటి ఫీడ్ అయ్యే మార్గాలను అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకం సహాయపడుతుంది. నెహ్రూ అవలంబించే విధానం వ్యావహారికసత్తావాదం మరియు ఆదర్శవాదం. ఎందుకంటే ఇది సాధారణ మరియు అనుభావిక కట్టుబాట్లు, అంతర్గత మరియు భౌతికంగా కనిపించే మరియు కనిపించని వాటి యొక్క సమ్మేళనం.

ఈ పుస్తకంలోని ఆలోచనల స్పష్టత పాఠకులను ఆశ్చర్యపరుస్తుంది. ఆధునిక భారతదేశం యొక్క ఆలోచన మరియు పురాతన నాగరికత యొక్క వాగ్దానానికి ఇది ఒక అనివార్యమైన నిధి.తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకాలలో నెహ్రూ గారి పుస్తకమొకటి.

-డా.నారాయణ నక్కిన



"ఎంతోకాలం క్రితం మనం భవిష్యత్తుతో సమాగమాన్ని నిర్ణయించుకుని, సంకేత సమయాన్ని కూడా ఏర్పరుచుకున్నాం. ఇప్పుడు మన ప్రతిజ్ఞ నెరవేర్చే సమయం వచ్చింది. మొత్తంగా నెరవేర్చడం లేకపోయినా గణనీయమైన స్థాయిలో నెరవేరుస్తున్నాం. అర్థరాత్రి గంట మోగినప్పుడు, ప్రపంచం నిద్రలో మునిగిపోయినప్పుడు, భారతదేశం నవజీవితంలోకి, స్వాతంత్ర్యంలోకి మేల్కొంటుంది."

- జవాహర్‌లాల్ నెహ్రూ


(1947 ఆగస్టు 15 రాజ్యాంగ సభ)

## పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతి

## నవంబర్ 14న బాలల దినోత్సవం

శుభాకాంక్షలతో....

- నన్నయవాణి



## మంచి మాట

'విజయుడు కావాలంటే విద్యయే సాధనం'
భయం- భయం కంటే ఎక్కువ భయంకరమైన దయ్యాల్ని సృష్టిస్తుంది.
వాస్తవాలు వాస్తవాలే! అవి మన ఇష్టానిష్టాలవలన అంతరించవు.

పండిట్ జవహర్లాల్ నెహ్రూ


# నూతన కోర్సు కోఆర్డినేటర్ల నియామకం



నూతన కోర్సు కోఆర్డినేటర్లును అభినందిస్తున్న వీసీ


**02.11.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఆయా విభాగాలకు నూతన కోర్సు కోఆర్డినేటర్లును నియమిస్తూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఉత్తర్వులు జారీ చేసారు. విశ్వవిద్యాలయంలోని మంగళవారం నూతన కోర్సు కోఅర్డినేటర్లకు వీసీ నియామకపత్రాలను అందజేసి వివరాలను తెలియజేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ అర్ట్స్ అండ్ కామర్స్ లో తెలుగుశాఖకు డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్, సైకాలజీ విభాగానికి డా.ఎన్.వి.వి.ఎస్.నారాయణ, ఎకనామిక్స్ విభాగానికి డా.టి.అనితకుమారి, సోషల్ వర్క్ విభాగానికి డా.ఆర్.జానకిరావ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ లో ఎం.పి.ఈడీ విభాగానికి డా.కె.బాలసత్యనారాయణ, సైన్స్ కాలేజ్ లోని ఫిజిక్స్ విభాగానికి డా.ఎస్.రాజలక్ష్మీ లను నూతన కోర్సు కోఆర్డినేటర్లుగా నియమించామన్నారు. నూతన కోర్సు కోఆర్డినేటర్లు విభాగాలను విద్యాపరంగా అభివృద్ధి చేయాలని, పరిశోధనల దిశగా విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని వీసీ సూచించారు. అన్ని విభాగాలు విద్యా పరమైన, పరిశోధన పరమైన కార్యక్రమాలను, సెమినార్లును, వెబినార్లను నిర్వహిస్తూ అప్ డెట్ గా ఉండాలన్నారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యాంశాలను బోధించడంతో పాటు ఉద్యోగ ఉపాధి మార్గాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాలని తెలియజేసారు. విద్యార్థుల శ్రేయస్సు కోసం విశ్వవిద్యాలయం పని చేస్తుందని విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.కె.రమణేశ్వరి, డా.కె.సుబ్బారావు పాల్గొన్నారు.

# తూమాటిని అభినందించిన రిజిస్ట్రార్



తూమాటిని సన్మానించి గ్రంథావిష్కరణ చేస్తున్న రిజిస్ట్రార్ అశోక్

**02.11.21 (మీడియాసెల్)** చెన్నపురి తెలుగువాణి సంస్థకు చెందిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ తూమాటి సంజీవరావు రచించిన "కందుకూరి కావ్యద్వయం" గ్రంథాన్ని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ ఆవిష్కరించి ఆయనను అభినందించారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ ను తూమాటి సంజీవరావు మర్యాదపూర్వకంగా కలిసి, గంథ్రాన్ని అవిష్కరించాలని కోరారు. రిజిస్ట్రార్ గ్రంథాన్ని ఆవిష్కరించి కందుకూరి రచించిన రెండు చక్కని గ్రంథాలకు వ్యాఖ్యానాలను రచించిన తూమాటి సంజీవరావును శాలువాతో సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు.తరువాత తూమాటి విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయాన్ని, తెలుగుశాఖను సందర్శించారు. ఈ సందర్భంగా తూమాటి మాట్లాడుతూ ప్రముఖ సంఘసంస్కర్త, సాహిత్యవేత్త కందుకూరి వీరేశలింగం జన్మించిన నేలపై ఆదికవి నన్నయ పేరుతో విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించి అభివృద్ధి దిశగా నడపడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. విశ్వవిద్యాలయ స్థాయిలో తొలితెలుగు వారపత్రిక "నన్నయవాణి"ని స్థాపించి విజయవంతంగా నడిపిస్తున్న వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు భాషాభిమానాన్ని ప్రశంసించారు. విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ దశాబ్ది కాలంగా ఎం.ఏ.తెలుగు కోర్సును,జె.ఆర్.ఎఫ్.పరిశోధనలను అందిస్తూ తెలుగుభాషాభివృద్ధికి పాటుపడుతుందన్నారు. తెలుగుశాఖలో ఆరు వేలకు పైగా పుస్తకాలను సేకరించి చక్కని లైబ్రరీని ఏర్పాటు చేసిన డా.తలారివాసు కృషిని అభినందించారు. తెలుగుభాష, సాహిత్య పరిరక్షణకు అభివృద్ధికి విద్యావంతులంతా కృషి చేయాలని తెలియజేసారు.తెలుగు శాఖాధిపతి బాధ్యతను చేపట్టిన డా.కె.వరప్రసాద్ ను అభినందించారు.ఈ కార్యక్రమంలో తెలుగుశాఖ ఆచార్యులు డా.తలారివాసు, డా.దొంతరాజు లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.



ఆదికవి నన్నయ భట్టారకుని స్మరిస్తూ....




మంత్రి డా.ఆదిమూలపు సురేష్ ని సత్కరిస్తున్న వీసీ ఆచార్య జగన్నాథరావు



నూతనంగా ప్రారంభమైన వర్క్‌షాప్ భవనం



విద్యార్థులు తయారు చేసిన విశ్వవిద్యాలయ నిర్మాణ చిత్రం



విశ్వవిద్యాలయ విద్యార్థులతో సంభాషిస్తున్న విద్యాశాఖామంత్రి,ఉపకులపతి









విద్యార్థుల నవ్య పరికల్పనలకు అభినందిస్తున్న మంత్రి,ఉపకులపతి







ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in